క్లుప్తంగా

సీఐని కలిసిన సీపీఐ నాయకులు



మడికొండ: కాజీపేట మండలం మడికొండ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్‌హెచ్‌ఓ పుల్యాల కిషన్‌ను మంగళవారం మడికొండకు చెందిన సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, కొట్టపాక రవి, మంద సుమన్ కలిసి శాలువా, పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నేతకు సన్మానం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో మంగళవారం బీజేపీ నాయకుడికి రైల్వే నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల 46వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పిట్టల రమేశ్ ముదిరాజ్‌ను రైల్వే నాయకులు పాశం దేవయ్య, బాల్య రవీందర్, దుర్గప్రసాద్, అరుణ్‌లు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

'బీజేపీతోనే కవితకు బెయిల్'

హసన్‌పర్తి: బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు కావడం వల్ల ఎమ్మెల్సీ కవితకు ఐదు నెలల్లోనే బెయిల్ మంజూరైందని ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి ఆరోపించారు. హసన్‌పర్తిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవిత బెయిల్ కోసం కేటీఆర్, హరీశ్‌రావులు ప్రధాన మంత్రి మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలుస్తూ బెయిల్ మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ విలీన ప్రక్రియ మొదలైందని అనుమానం వ్యక్తం చేశారు.

పోచమ్మ బోనాలకు రండి

హన్మకొండ చౌరస్తా : హనుమకొండ న్యూశాయంపేటలో ఈనెల 29న నిర్వహించే పోచమ్మ బోనాల మహోత్సవాలకు రావాలంటూ 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యలను వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. ప్రతిఏటా శ్రావణమాసం చివరి గురువారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

తమలపాకులతో అలంకరణ

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయస్వామికి మంగళవారం తమలపాకులతో ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని నిత్య పూజలను జరిపించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మల్లెలు, తమలపాకులతో స్వామి వారిని అలంకరించారు.

మంజులకు ఎన్టీఆర్ అవార్డు



హన్మకొండ చౌరస్తా: వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాల అధ్యాపకురాలు, చిత్రకారిణి హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన సాగంటి మంజులను మదర్‌థెరిస్సా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో సత్కరించారు. విజయవాడలో సోమవారం జరిగిన మదర్ థెరిస్సా సర్వీస్ సొసైటీ రెండో వార్షికోత్సవ వేడకల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ రంగాల్లో సేవలందించిన వారిని అవార్డుతో సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టిస్టులు, కళాశాల అధ్యాపకులు మంజులను అభినందించారు.

గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక

హన్మకొండ: హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీని కాలనీపార్కులో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా తంగెళ్ళపల్లి శంకరాచారి, కోశాధికారిగా రాంపెల్లి రాజప్రభూ, కార్యవర్గ సభ్యులుగా కటకం శివప్రసాద్, ఓడెల రమేష్, రొయ్యల సత్యనారాయణ, చెన్నూరి బాపు రావు, మిట్టపల్లి సిద్ధారెడ్డి, జెంపల్లి కుమార్ రాజు ఎన్నికయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

కాజీపేట అర్బన్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు మండల నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ సూచించారు. కడిపికొండ ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి భాగస్వాములు కావాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు.

రహదారులపై నిఘా పటిష్ట పరుస్తాం

- మామునూరు ఏసీపీ తిరుపతి
- వాగ్దేవి బొల్లికుంట క్రాస్‌రోడ్డుపై కార్డన్‌సెర్చ్



కార్డన్‌సెర్చ్‌లో స్వాధీనపర్చుకున్న 95 ద్విచక్రవాహనాలను చూపిస్తున్న ఏసీపీ తిరుపతి

మామునూరు : రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం జాతీయ రహదారులపై మరింత నిఘాను మరింత పటిష్ట పరుస్తామని, నేరాలను అరికట్టేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ సూచనల ప్రకారం మంగళవారం రాత్రి ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఎదురుగా కాలనీల్లో సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ల రవికుమార్, బాబులాల్, రాజగోపాల్, రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జాతీయ రహదారిని దిగ్బంధించి తనిఖీలు చేపట్టారు. తనిఖీలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 95 ద్విచక్రవాహనాలు, అంబర్ ప్యాకెట్లు సీజ్ చేశారు. అనంతరం పలు కాలనీల్లో ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. అద్దెకుంటున్న వ్యక్తులు, అనుమానితులను విచారించి వదిలేశారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థి దశలో మద్యం, గంజాయి మత్తుకు బానిసకావద్దని, తల్లిదండ్రుల ఆశయాల సాధన కోసం కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత రహదారులపై తిష్టవేసి బెదిరింపులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 చేయాలని సూచించారు. కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

25 గ్రాముల గంజాయి పట్టివేత ..!

అదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ విద్యార్థి వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ డీ చదువుతున్నాడు. బొల్లికుంట క్రాస్ రోడ్డులోని ఓ బాయ్స్ హాస్టల్‌పై మామునూరు పోలీసులు తనిఖీ చేయగా ఓ విద్యార్థి బ్యాగులో 25 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం మామునూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి



ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

హన్మకొండ అర్బన్ : తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులు 54 వృత్తుల్లో పనులు చేస్తున్నారన్నారు. వీరంతా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చెందిన పేదలని, తెలంగాణలో 2007లో వెల్ఫేర్ బోర్డును ప్రకటించి 2009 నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వీరికి చెందిన సంక్షేమ పథకాల అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రయత్నం చేస్తూ టెండర్లకు ఆహ్వానిస్తున్నారన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓకు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, ఆఫీస్ బేరర్స్ అశోక్, యాకయ్య, రాజేష్, లింగమూర్తి, మల్లయ్య, రాజు, సుధాకర్,వెంకటేష్, ప్రభాకర్, సూర్యనారాయణ, వెంకటేశ్, వనజ, శ్రీవాణి పాల్గొన్నారు.

శివశక్తి వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరంలో శ్రీగణపతి, శివలింగం, నందీశ్వర సహిత పార్వతీదేవీ విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు మంగళవారం జరిగాయి. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బైరబోయిన దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, కోశాధికారులు మంతిని చక్రధారి, గండి నాగరాజు, గంద్రాతి నవీన్, సలహాదారులు, ఉపాధ్యక్షులు అచ్చ వినోద్‌కుమార్, సిద్ధం రాము, సారంగపాణి, గజ్జెల శ్యాం ఆధ్వర్యంలో వేదపండితులు పోలోజు భాస్కరాచార్యుల నేతృత్వంలో విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య హాజరై ప్రతిష్ఠాపన విగ్రహాలను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారికి శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, పోశాల పద్మ, కమిటీ బాధ్యులు బాసాని శ్రీనివాస్, నల్లకుంట రవికుమార్, వడ్డెపల్లి భారత్, రాజన్‌బాబు, తాళ్లపెల్లి రమేష్, రాంమోహన్‌రావు, వాసం సదానందం, రమేష్, బజ్జూరి శ్రీను, కొత్తపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

నంది కళ్లలో నుంచి నీరు..



వరంగల్ ఫోర్ట్‌రోడ్డు బంక్ జంక్షన్‌లోని శ్రీ శివశక్తి వినాయక మందిరంలో బుధవారం ప్రతిష్ఠించనున్న నందీశ్వరుడి కళ్ల నుంచి నీరు ఉబికి వస్తుంది. ధాన్య వాసంలో ఉన్న నందీశ్వరుడిని గమనించిన స్థానిక భక్తులు మరింత ఆసక్తిగా తిలకించారు. కొంత మంది మహిళలు కొబ్బరికాయలు కొట్టి ప్రతిష్ఠాపన అంతా సవ్యంగా సాగాలని పూజలు చేశారు.

రైలులోనుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్ : కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఈ క్యాబిన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రైలులో గుర్తు తెలియని వ్యక్తి ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడగా ఎడమ కాలు మోకాలు వరకు తెగిపోయి పట్టాలపై రక్తస్రావంతో ఉన్నాడు. రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్‌ను పిలిపించి చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీ గదిలో భద్రపరచినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



హన్మకొండ చౌరస్తా : స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

వరంగల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం బెయిల్‌పై విడుదల కావడంతో పార్టీ జిల్లా నాయకుడు కేతిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా మాజీ కో ఆర్డినేటర్ ఎల్లావుల లలితయాదవ్, నాయకులు రాజపోశాలు, యాదగిరి, రాజు, యాదగిరి, సాంబయ్య, కళ్యాణ్, శంకర్, గోవిందు, అఫ్జల్, ఎండీ.సలీం, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర సరోగసి కమిటీ మాజీ సభ్యురాలు డాక్టర్ హరిరమాదేవి కవిత విడుదలపై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఖిలా వరంగల్ : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో చివరికి ధర్మం గెలిచిందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో మంగళవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఎమ్మెల్యే ఇంటి వద్ద బీఆర్ఎస్ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చిసంబురాలు జరుపుకున్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, టీ.రమేష్‌బాబు, ఇందిరా, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ: కుట్రలు ఓడి న్యాయం గెలిచిందని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం 100 ఫీట్ల రోడ్డు వడ్డెపల్లి చర్చి కూడలిలో బీఆర్ఎస్, భారత జాగృతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్పొరేటర్లు కిరణ్, రాజు లోహిత, ప్రవీణ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంపై ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. నయీమొద్దీన్, జనార్ధన్, అబ్దుల్‌కలాం, ఇస్మాయిల్, సరస్వతి, విజయ, మునీర్, సలీం, దేవీ, రమ, హైమావతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీకి పరీక్షల విభాగం ఎంతో కీలకం



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి పరీక్షల విభాగం ఎంతో కీలకం అని పరీక్షల ఆ విభాగంలో పని చేసేవారు జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. ఎంపిక చేసిన బోధనేతర ఉద్యోగులకు నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా చివరి వారం మంగళవారం యూనివర్సిటీ యాక్ట్, స్టాట్యూటూట్స్ విశ్వవిద్యాలయంలో రోజువారి పాలన, అకౌంట్స్, మాడ్యూల్ పరీక్షల విభాగం అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థి పరీక్ష ఫీజు, దరఖాస్తుల నుంచి ఫలితాల వెల్లడి తర్వాత ఇచ్చే మెమోలు, వివిధ దశల్లో విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ మేఘనరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

వీసీని నియమించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ (వీసీ)ను నియమించాలని, అలాగే యూనివర్సిటీలోని వివిధ సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు. మంగళవారం కేయూలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. భరత్‌రాజ్, అశోక్, రత్నాకర్, కిరణ్‌సాయి పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

రామన్నపేట : వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన 13 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.18,600 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందికి రూ.34,600 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

తాగునీరు కలుషితం



వరంగల్: మూడు నెలలుగా తాగునీటిని సరఫరా చేసే పైపు నుంచి లీక్ అయిన నీరు మురుగునీటితో కలుషితం అవుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 20వ డివిజన్ శాంతినగర్ స్లమ్ ఏరియాలోని ప్రజలకు నీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ డ్రెయినేజీ నీటితో కలుషితం అయి ప్రజలకు సరఫరా అవుతున్నా పట్టించుకున్న నాథుడే లేరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



కాజీపేట: 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలో కొలువుదీరిన స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం గణపతి నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికలను భక్తులు ఆవిష్కరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆహ్వాన పత్రికలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డులో వడ్డేపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది వార్డుల్లో పర్యటిస్తూ జ్వర పరీక్షలు చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో వారానికి రెండు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి ఎమ్మెల్యే సుబేదారిలోని అలీపురలోని బడి మజీద్ ప్రాంతంలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైయినేజీ అంతర్గత రోడ్ల నిర్మాణాలు, పేరుకుపోయిన చెత్త చెదారం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇల్లు లేదని కొందరు మహిళలు కోరగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, కాంగ్రెస్ నాయకులు సంపత్ యాదవ్, లక్ష్మారెడ్డి, కోన శ్రీకర్, కొండా నాగరాజు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోకుల్‌నగర్‌లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి ఊయలను ఊపుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు

హన్మకొండ: హనుమకొండ గోకుల్‌నగర్‌లో సోమవారం రాత్రి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణుని దేవాలయంలో అర్చకుల మంత్రోచ్ఛరణాల మధ్య వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం మండపంలోని పోరాడే చిన్నికృష్ణుడు ఉన్న ఊయలను జోలే పాడుతూ ఊపారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. దేవాలయ కమిటీ బాధ్యులు సీపీకి శాలువా కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ప్రారంభించారు. గోపికలు, శ్రీ కృష్ణుని వేషధారణలతో నృత్యం చేసిన బాలబాలికలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, గోకుల్ యాదవ సంఘం, పోచమ్మ, శ్రీ కృష్ణ దేవాలయ కమిటీ బాధ్యులు బంక సంపత్ యాదవ్, మూగల కుమార్ యాదవ్, రమేష్ యాదవ్, రాజు, సతీష్, సిహెచ్. వెంకన్న, సతీష్, భాస్కర్, నాగరాజు, సాయి పాల్గొన్నారు.

నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న షీ టీమ్ సీఐ సుజాత

రామన్నపేట : నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత అన్నారు. మంగళవారం రామన్నపేటలోని కీస్ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని, షీటీమ్స్ వాట్సాప్ నంబర్లు సీపీ నెంబర్ 87126 85257, సీఐ నెంబర్ 87126 85142, ఎస్సై నెంబర్ 87126 85270 కి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచి నేరస్థులకు శిక్షలు, కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. విద్యాసాగర్, కె.వసంతలక్ష్మి, అనీస్, స్వాతి, వై.భవ్యనాగు, షీటీమ్ హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ కె.వంశీకృష్ణ, మహిళా కానిస్టేబుల్ సువార్త, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాల రద్దుకు ఫిర్యాదు

- కబ్జాదారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుకు నిర్ణయం
- సొసైటీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరంలో సొసైటీ గోదాంకు కొనుగోలు చేసిన భూమిపై కబ్జాదారులు పొందిన పాస్ పుస్తకాల రద్దుకు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. హసన్‌పర్తి పీఏసీఎస్ పాలకవర్గ సమావేశం మంగళవారం జరుగగా కమిటీ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. గోదాం కోసం కొనుగోలు చేసిన భూమి కబ్జా చేసి, రిజిస్ట్రేషన్ చేసిన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. 1983లో సొసైటీకి విక్రయించిన పట్టాదారులు ఆ భూమిని తిరిగి 2021లో ఎలా రిజిస్ట్రేషన్ చేశారనే విషయంపై పాలకవర్గ సభ్యులు తీవ్రంగా పరిగణించారు. సుమారు రూ.2 కోట్ల విలువైన భూమి కబ్జాపై పాలకవర్గం సీరియస్‌గా తీసుకున్నారు. అక్రమంగా భూమి కబ్జా చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుపై నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

సొసైటీ పేర రిజిస్ట్రేషన్‌కు తీర్మానం

అన్నాసాగరంలో గోదాం కొనుగోలు చేసిన భూమి అప్పటి సొసైటీ చైర్మన్ చింతలపాణి సుధీర్‌రెడ్డి పేర రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఆయన పేరు నుంచి సొసైటీ పేరకు మార్చాలని పాలకవర్గ సభ్యులు తీర్మాణం చేశారు. అలాగే ప్రస్తుతం సొసైటీలో నమోదు సభ్యుల సంఖ్య? రుణాలు తీసుకున్న సభ్యులు ఎంత మంది? ఎంత మంది రైతులకు రుణాలు మాఫీ అయ్యాయనే విషయమై సభ్యులు చర్చించారు. సొసైటీ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, సభ్యులు కుమారస్వామి, కర్ణాకర్‌రెడ్డి, విజేందర్, జానకి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యెలుగం శ్రీనివాస్ ప్రజానాయకుడు



వరంగల్: మాజీ కార్పొరేటర్, మాజీ కుడా సమన్వయకర్త యెలుగం శ్రీనివాస్ ప్రజానాయకుడు అని ఆయన లేని కొత్తవాడను ఊహించుకోలేమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. శ్రీనివాస్ సోమవారం మృతి చెందగా ఆయన అంత్యక్రియలు రాత్రి జరిగాయి. విషయం తెలుసుకున్న కొండా మురళీ మంగళవారం కొత్తవాడలోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రీనివాస్ సతీమణి, కుమారులను పరామర్శించి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి, నాయకులు నవీన్‌రాజు, అయూబ్‌ఖాన్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ కంట్రోల్ కమిటీ విస్తృత తనిఖీలు



హన్మకొండ : వరంగల్ పోలీసు కమిషనరేట్ డ్రగ్స్ కంట్రోల్ టీం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. మంగళవారం రైల్వేస్టేషన్, బస్ స్టేషన్‌లు, బస్సుల్లోనూ విస్తృతంగా పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. మత్తు పదార్థాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రగ్స్ కంట్రోల్ టీం అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. హనుమకొండలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో, బస్సుల్లో ప్రయాణికులను, ప్రయాణీకులు వెంట తీసుకెళ్తున్న బ్యాగులను తనిఖీ చేశారు. అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: గోకులాష్టమి సందర్భంగా మడికొండ మెట్టుగుట్టలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసీదళాలతో, వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించా రు.ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి, శివాలయం చైర్మన్ రఘుచందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అలాగే మడికొండలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కల్లెపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు దువ్వ విజయ్, పత్తిపాక ఉపేంద్రాచారి, కడార్ల నరేందర్, బజ్జూరి శ్రీనివాస్, అర్జున్, కుమార్, రమేశ్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నయీంనగర్: తెలంగాణ మున్సిపల్ కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో మంగళవారం కుడా కార్యాలయంలో సీడీఎంఏ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ఏల్పుల ధర్మరాజు, పుల్లా రమేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.